ఈనాడు
మహబూబ్‌నగర్
ఆదివారం ఆగస్టు 30, 2026

అందాల సాగరం.. దారంతా నరకం

కోయిలసాగర్ తిలకించేందుకు వెళ్లే పర్యాటకులకు ఆ దారంతా నరకం కన్పిస్తోంది. దేవరకద్ర మండలంలో కోయిల సాగర్ గ్రామం నుంచి జలాశయం వరకు రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై కంకర, డస్ట్ వంటి భారీ వాహనాల రాకపోకలతో పెద్దఎత్తున గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం జలాశయంలోకి వరద వచ్చి చేరుతుండటంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, దేవరకద్ర

లెక్క తప్పిన వరి సాగు

చిమనగుంటపల్లిలో బోరుబావి కింద సాగైన వరి

హన్వాడ, వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో పంటల ప్రణాళిక లెక్క తప్పుతోంది. ఏటా వానాకాలంలో సాగయ్యే వరి సాగు భారీగా తగ్గిపోయింది. ఆగస్టులోనే వరినాట్లు పూర్తవ్వాల్సి ఉండగా చాలాచోట్ల ఇంకా పెండింగ్‌లో పడింది. జూరాల కాల్వల ద్వారా గొలుసు కట్టు చెరువులను నింపాల్సి ఉండగా ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. లోటు వర్షపాతంతో భూగర్భ జలాలు సైతం తగ్గి అధికశాతం మంది రైతులు వరి నాట్లకు వెనకడుగు వేశారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ అధికారుల అంచనాల కంటే ఇంకా 20 నుంచి 25 శాతం వెనకబడి పోయింది.

- సెప్టెంబరులో వరి నాట్లు వేయడం మంచిది కాదని, రైతులు మెట్ట పంటలపై దృష్టి సారించాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ పంటల సాగుపై ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా సర్వే చేపట్టింది. అసలు వరిసాగుకు నీటి వనరులు అనుకూలంగా ఉన్న ప్రాంతాలు, సాగు ఎంత మొత్తంలో చేశారు.. నారు సిద్ధంగా ఉన్నా సాగు వేయని పరిస్థితులపై అంచనాలు వేస్తూ నివేదికలను తయారు చేస్తున్నారు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది 2,32,800 ఎకరాల్లో వరి సాగైంది. ఈ ఏడాది 1,45,000 ఎకరాల్లో నాట్లు వేశారు. సాధారణ సాగు 1,95,820 ఎకరాలు. ఇతర మెట్ట పంటలన్నీ కలిసి 2,98,500 ఎకరాల్లో సాగు చేశారు. సెప్టెంబరులో వరి తగ్గి మెట్టపంటల సాగు పెరిగే అవకాశం ఉంది.

పల్లె దవాఖానాలకు తాళం.. కాసులిస్తేనే ప్రారంభం

- కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉప కేంద్రాలు
- బిల్లులు అందక గుత్తేదారుల ఆందోళన

కోయిలకొండ మండలం బూర్గుపల్లిలో పల్లె దవాఖానా నిర్మించి రెండేళ్లవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. అద్దె భవనంలోనే రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి. సరైన సౌకర్యాలు లేని పాత భవనంలో వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో పల్లె దవాఖానా నిర్మాణం మూడేళ్ల నుంచి సాగుతూనే ఉంది. భవనానికి రంగులు వేస్తే సరిపోతుంది. డబ్బులు లేక గుత్తేదారు రంగులు వేయడం లేదు. దీంతో అసంపూర్తిగా ఈ భవనం ఉంది.

పాలమూరు, న్యూస్‌టుడే: పల్లె ప్రజల సంక్షేమానికి ఆరోగ్య ఉపకేంద్రాల (పల్లె దవాఖానాలు) నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. ఐదు చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. పూర్తయిన వాటిని ప్రారంభించాలని చూసినా గుత్తేదారులు వాటికి తాళాలు వేసుకున్నారు. అప్పులు చేసి తాము నిర్మాణాలకు వ్యయం చేశామని, కేంద్రం మంజూరు చేసిన నిధులు తమకు బిల్లులుగా ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

- జిల్లాలో 129 పల్లె దవాఖానాలున్నాయి. వీటిలో 66 ఉపకేంద్రాలకు పక్కా భవనాలున్నాయి. మిగిలిన 63 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అందులో సరైన సదుపాయాలు లేకపోవడంతో వైద్యులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని వసతులతో జాతీయ ఆరోగ్య పథకం ద్వారా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరిట రూ. 20 లక్షలు చొప్పున మంజూరు చేసింది. 2022-23లో జిల్లాకు 24 భవనాలు మంజూరు కాగా.. గుత్తేదారులు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. విడతల వారీగా నిధులు రావడంతో బిల్లులు వచ్చిన మేరకు పనులు చేశారు. దమ్మగ్నపూర్, లాల్‌కోట, అన్నాసాగర్, తాటిపర్తి, ముచ్చింతల్‌లో భవనాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. బిల్లులు ఇస్తేనే అప్పగిస్తామని గుత్తేదారులు భవనాలకు తాళాలు వేశారు.

చర్యలు తీసుకుంటున్నాం

ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు విడుదల చేసి గుత్తేదారులతో మిగిలిన పనులు పూర్తి చేయిస్తాం. వారం, పది రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి ఆరోగ్య మందిరాలను ప్రారంభిస్తాం.

- డా.శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

నేడు, రేపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), అలంపూర్, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆది, సోమవారాల్లో ఉమ్మడి జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆదివారం 7.15 గంటలకు అలంపూర్ జోగులాంబ ఆలయ సన్నిధిలో లైట్ అండ్ సౌండ్ షో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. మరుసటిరోజు సోమవారం ఉదయం 7 గంటలకు అలంపూర్ క్షేత్రంలో శ్రీజోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకుంటారు. 9 గంటలకు జోగులాంబ రైల్వేస్టేషన్ పనులను తనిఖీ చేస్తారు. 10.30కు గద్వాల రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటలకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు నగరంలో భాజపా జిల్లా కార్యవర్గసభ్యులు, మండల అధ్యక్షుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై మార్గదర్శనం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు జడ్చర్లలోని రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తారు.

B.Ed Seats Available
For the Academic Year-(2026-28)
St. Mary's College
(MBNR)
Contact: 9000624135

ITI SPOT ADMISSIONS
ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం సం॥నకు రూ. 16,500/- మాత్రమే. ఈ క్రింది కోర్సులలో ప్రవేశం గలదు. 1) ఫిట్టర్, 2) ఎలక్ట్రానిక్ మెకానిక్ 3) ఎలక్ట్రీషియన్ 4) ప్లంబర్ 5) డీజిల్ మెకానిక్, 6) డ్రాఫ్ట్‌మెన్ సివిల్.
నోట్: COPA (కంప్యూటర్) కోర్సు 1 సం॥కు రూ. 13,200/-లు మాత్రమే.
మిగతా వివరాలకు
మార్కోని ITI, నల్లగొండ
శ్రీ శారద ITI, మిర్యాలగూడ
Cell: 98482 45036, 94900 97071, 94404 05112

ఇళ్ల సాకు.. ఇసుకాసురుల ముసుగు

రేకులంపల్లి వాగును చెరబట్టిన అక్రమార్కులు

రేకులంపల్లి శివారు వాగులోని ఇసుకను టిప్పర్‌లోకి వేస్తున్న పొక్లెయిన్

చిన్నచింతకుంట (కౌకుంట్ల), న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముసుగులో వాగులు, వంకలను ఇసుకాసురులు చెరబడుతున్నారు. పొక్లెయిన్లు, టిప్పర్లను మోహరించి పెద్ద ఎత్తున దందా సాగిస్తున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కౌకుంట్ల మండలంలోని రేకులంపల్లి గ్రామ శివారులోని వాగులో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. పొక్లెయినుతో ఇసుకను తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక తోడేస్తే బోర్లు వట్టిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సామాన్యులైతే సాధ్యమా?

నిజంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అయితే అవసరమైన మేరకు ఇసుకను చిన్న వాహనాల్లో తీసుకెళ్తారు. పొక్లెయిన్లతో ఇసుక తవ్వి, టిప్పర్లలో పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంతో పేరిట జరుగుతున్న దందాతో జలవనరులు ధ్వంసం అవుతున్నాయి. దీనిపై తహసీల్దార్ సుందర్‌రాజ్‌ని వివరణ కోరగా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పారు.

హరినారాయణ.. స్వామినారాయణ

జడ్చర్లలోని నాగసాల సమీపంలో భగవాన్ స్వామినారాయణ విగ్రహ ప్రతిష్ఠకు 21 రాష్ట్రాల స్వామీజీలు హాజరయ్యారు. స్వామిని స్తుతిస్తూ భక్తులు భజనలు చేశారు. **- న్యూస్‌టుడే, జడ్చర్ల పట్టణం**

158 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు (అమరచింత), న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో శనివారం 4 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన 2, దిగువన 2 టర్బయిన్లలో 158 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందన్నారు. పవర్ హౌస్ ద్వారా 13,918 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

రూ.27.32 కోట్ల ధాన్యం పక్కదారి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండలంలోని పర్వతాపురం గ్రామ శివారులోని శ్రీ గురుదత్తా ఇండస్ట్రీస్‌లో రూ. 27.32 కోట్ల ధాన్యం పక్కదారి పట్టిందని డీఎస్వో, డీఎం ఆంజనేయులు ఫిర్యాదు మేరకు రైస్‌మిల్లు యజమాని కొండూరు రాధిక నందకిశోర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్ శనివారం తెలిపారు. ఈ నెల 25న సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీగురుదత్తా రైస్ మిల్లుపై దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. రైస్‌మిల్లులో 7521.3644 టన్నుల ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించి ధాన్యం విలువ పెనాల్టీ, వడ్డీతో కలిపి రూ. 27,32,34,089 కోట్లు ఉంటుందని డీఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈ మొక్క.. అడవికే చిక్కు

- నల్లమలను మింగేస్తున్న 'కోరింత'
- నిధులు లేక చేతులెత్తేసిన అటవీ శాఖ

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించే అడవుల అభివృద్ధికి కోరింత మొక్క(లాంటానా) అడ్డుపడుతోంది. అడవిలో వేగంగా విస్తరిస్తూ పర్యావరణంపై ప్రభావం చూపుతోంది. నిధుల కొరతతో లాంటానా తొలగింపు పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. దీంతో అడవిలో ఈ మొక్కలు వేగంగా విస్తరిస్తూ జీవవైవిధ్యానికి అడ్డుగా నిలుస్తున్నాయి.

అడవిలో ఏపుగా పెరుగుతున్న కోరింత మొక్కలు

పర్యావరణానికి చేటు

లాంటానా పరిసరాల్లోని మొక్కలకు నీరు, పోషకాలు అందకుండా చేస్తాయి. ఎక్కువగా వాడుకలో లేని నేలల్లో ఇవి వేగంగా పెరుగుతూ, ఆ ప్రాంతాన్ని ఆక్రమిస్తాయి. ఇతర మొక్కలను ఎదగనీయకుండా కొన్ని రసాయనాలను విడుదల చేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మొక్కలతో పశువులు, అడవిలోని శాకాహార జంతువులకు ఆహారం లభించని పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. కొన్ని రకాల ఔషధ మొక్కలు అంతరించిపోయే ప్రమాదముంది. తియ్యగా ఉండే వీటి పండ్లను పక్షులు, ఇతర చిన్న జంతువులు తిని గింజలను ఇతర ప్రాంతాల్లో విసర్జిస్తుండటంతో ఆ ప్రాంతంలో ఇవి మొలకెత్తి వేగంగా విస్తరిస్తాయి. వేసవిలో ఎండిపోయే ఈ మొక్కలు అడవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో మంటలను వేగంగా వ్యాపింపజేస్తాయి. వీటితో పాటు చిన్న మొక్కలు, పొదలను ఆశ్రయించి గూళ్లు ఏర్పరచుకున్న జీవులు నశించిపోయే అవకాశం ఉంది.

వన్య ప్రాణులకూ ఆటంకం: కోరింత మొక్క రెండు మీటర్ల ఎత్తు వరకు గుబురుగా పెరుగుతుంది. నల్లమల అడవిలో సుమారు 30 శాతాన్ని ఈ మొక్కలు ఆక్రమించాయి. ఇతర మొక్కల పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. గుబురుగా పెరిగే వీటితో వన్యప్రాణులు తిరిగే మార్గాలు మూసుకుపోతున్నాయి. అవి స్వేచ్ఛగా సంచరించలేవు.

రూ.24 లక్షలు కేటాయించాం: సఫారీ జోన్‌లో లాంటానా తొలగించేందుకు రూ. 24 లక్షలు కేటాయించాం. పూత వచ్చే ముందే వరుసగా మూడేళ్లపాటు మొక్కలు తొలగిస్తాం. నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మంజూరైతే ఇతర ప్రాంతాల్లోనూ వాటిని తొలగిస్తాం.

- రేవంత్ చంద్ర, డీఎఫ్‌వో నాగర్‌కర్నూల్

60,959 మందికి 'సర్' నోటీసులు

పాలమూరు, న్యూస్‌టుడే: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)లో భాగంగా జిల్లాలో 60,959 మందికి నోటీసులు అందించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీసీలో అదనపు కలెక్టర్ పలు అంశాలపై స్పందించారు. జిల్లాలోని ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,36,590 నోటీసులు జనరేట్ చేసినట్లు వివరించారు. నోటీసుల జారీ, వారం రోజుల గడువు, డీసెంట్రలైజ్డ్ హియరింగ్ తదితర అంశాలపై నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ప్రారంభానికి నోచని భవనం ఇదే..

ప్రారంభిస్తే అదే మహాప్రసాదం

- అలంపూర్‌లో సందర్శకులకు తప్పని నిరాశ
- హామీలు విస్మరిస్తున్న నేతలు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ జోగులాంబ ఆలయ సందర్శనానికి దేశ విదేశాల భక్తులు తరలివస్తారు. వీరి సౌకర్యార్థం కట్టిన భవనం ప్రారంభానికి నిరీక్షిస్తోంది. పట్టణంలోని యోగ నరసింహస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో భాగంగా దాదాపు రూ.36 కోట్లతో భారీ భవనం నిర్మించారు. ఇందులో భక్తులకు 25 వసతి గదులు, కల్యాణ మండపం, భోజనశాల, ఓపెన్ థియేటర్, ముందు భాగంలో షట్టర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. సమీపంలోనే భక్తుల కోసం బస్టాండ్ సైతం ఏర్పాటు చేస్తున్నారు. 90 శాతం వరకు పనులు పూర్తి చేశారు. ఏడాది కిందట ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా భవనాన్ని ప్రారంభించారు. మిగతా పనులు జరగకపోవడంతో నేటికీ భక్తులకు అందుబాటులోకి రాలేదు. దీంతో భవనం దుమ్ము, ధూళితో అధ్వానంగా తయారైంది. గతంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, కలెక్టర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, అప్పటి పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సైతం పరిశీలనకు వచ్చి పనులు త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులు, సంబంధిత అధికారులను ఆదేశించినా అమలు కాలేదు.

ఇంకా ఏమేం చేయాలంటే:
- భవనం నుంచి ఆలయాల వరకు బీటీ రోడ్డు పనులు చేయాలి.
- అక్బర్‌పేట్ ప్రధాన రోడ్డు వరకు బీటీ రహదారి వేయాలి.
- హైమాస్ట్ దీపాలు, నదిలో బోట్
- పలుచోట్ల విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి.

హామీ ఇచ్చారు.. మళ్లీ వస్తున్నారు: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అలంపూర్ ఆలయాల దర్శనానికి వచ్చిన సందర్భంలో హామీ ఇచ్చారు. నవబ్రహ్మ ఆలయాలు చాలా మేరకు మూసి ఉంచుతున్నారని, పూజలు చేసేందుకు అవకాశం కల్పించాలని పలువురు ఆయన్ను కోరారు. పురావస్తు శాఖ అధికారులతో చర్చిస్తామని ఆయన చెప్పినా ఇప్పటికీ ఎలాంటి కదలిక లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

WESTERN ANDHRA TOLLWAYS PRIVATE LIMITED
A Portfolio Company of Interise Trust
INTERISE

శాఖాపూర్ టోల్ ప్లాజాలో తేది: 01-09-2026 నుండి అమలు కానున్న సవరణ రేట్లకు సంబంధించిన బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, లేఖ నం. **NHAI/RO-HYD /NH-44/AP-4/Shakapur/User Fee/E-257422/2026/1995 Dated: 07.08.2026** ప్రకారం సవరించిన టోల్‌ఫీజు రేట్లకు ఆమోదం తెలపడం జరిగింది. ఇట్టి సవరించిన టోల్‌రేట్లు ఎన్.హెచ్-44 (పాత NH-7) నందు (జడ్చర్ల నుండి కొత్తకోట బైపాస్) (80.050 కి.మీ.-135.740 కి.మీ) వరకు విస్తరించి ఉన్న రోడ్డులో తేది : 01-09-2026 (00.00 HRS) నుండి అమలు కాగలవు.

I. సవరించిన రుసుముల పట్టిక : (మొత్తం రూపాయలలో)

క్రమ సంఖ్య	వాహనము రకం	FASTAG ద్వారా మాత్రమే అందుబాటులో ఉన్నది		
		ఒకవైపు ప్రయాణం ఫీజు రూ॥	బహుళ ప్రయాణం ఫీజు రూ॥ (ఫీజు చెల్లింపు సమయం నుండి 24 గంటల వరకు వర్తించును.)	నెలసరి పాసు ఫీజు రూ॥
1.	కారు/ప్యాసింజర్/వ్యాను/జీపు/ తేలికపాటి మోటర్ వాహనం	85	125	2505
2.	చిన్న తరహా గూడ్స్ వాహనాలు లేదా మిని బస్సులు/ చిన్న తరహా వాణిజ్య వాహనాలు	145	220	4380
3.	ట్రక్కు/బస్సు (2-Axles)	290	440	8765
4.	అనేక ఇరుసు గల వాహనము (రెండు కన్నా ఎక్కువ ఇరుసులు)	470	705	14085

గమనిక :
- NHAI లేఖ నెం. NHAI/ PIU-MBNR/Toll Plazas/2026/524, తేది : 23-03-2026 ప్రకారం, జాతీయ రహదారి టోల్‌ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు 01-04-2026 నుండి నిలిపివేయబడ్డాయి. టోల్ ఫీజును Fastag లేదా UPI ద్వారా మాత్రమే చెల్లించాలి.
- అదనంగా, MoRTH నోటిఫికేషన్ నెం. G.S.R. 251(E), తేది: 02-04-2026 ప్రకారం, Fastag లేని వాహనాలు/ చెల్లని Fastag ఉన్న వాహనాలు UPI ద్వారా చెల్లింపు చేయడానికి ఎంపిక చేసుకున్నట్లయితే, 10-04-2026 నుండి వర్తించే వినియోగ రుసుములో 1.25 రెట్లు వసూలు చేయబడుతుంది.

2. టోల్ ప్లాజా నందు ఈ క్రింది రాయితీలు కలవు.
- అన్ని రకముల వాహనములకు బహుళ ప్రయాణ టికెట్ల రేటు, ఒకవైపు ప్రయాణ టికెట్టు రేటుకు 1.5 రెట్లు ఉండును. అట్టి టికెట్లు అట్టి వాహనమునకు తీసుకున్న తేది మరియు సమయము నుండి 24 గం॥ వరకు మాత్రమే వర్తించును.
- ఒక వాహనమునకు నెలసరి పాసుఫీజు, ఒకవైపు ప్రయాణమునకు 30 రెట్లు ఉండును. ఇట్టి పాసును అట్టి వాహనమునకు ఆ నెలలో ఎప్పుడైన ఎన్నిసార్లు అయినా వినియోగించుకునే సౌకర్యం ఉంటుంది.
- టోల్‌ఫీజు వసూలు చేయు టోల్‌ప్లాజాకు 10 కి.మీ. వ్యాసార్థ పరిధిలో ఉండే కారు/జీపు/వ్యాను యజమానులకు రాయితీ ద్వారా నెలకు రూ॥ 150/- వర్తించును. మరియు 20 కి.మీ. పరిధిలో ఉండే కారు/జీపు/వ్యాను యజమానులకు రూ॥ 300 వర్తించును.
- పాఠశాలల విద్యార్థులను తీసుకొని నిత్యం టోల్‌ప్లాజా గుండా ప్రయాణించే పాఠశాల బస్సులకు నెలకు రూ॥ 1000/- వర్తించును.

గమనిక: పైన తెలుపబడిన రాయితీ పాసులు, భారత ప్రభుత్వం జారీ చేయబడిన పాలసీ నెం. NHAI/13013/CO/2019-20/147464 తేది.15-1-2020 మరియు నెలసరి పాసుల నిర్వహణ/NHAI పాలసీ మార్గదర్శకాలు 2018, పాలసీ నెం.17.5.78 తేది.16-02-2018 ప్రకారం FASTAG ద్వారా మాత్రమే ఇవ్వడం జరుగుతుంది.

3. మినహాయింపు వాహనాల జాబితా భారత రాజపత్రం S.O.No.412(E) తేది: 06 ఫిబ్రవరి 2009 నందు ముద్రించబడిన ఫీ నోటిఫికేషన్‌లో కలదు.

4. నేషనల్ హైవే ఫీ (నిర్ణయించిన రేట్లు & వసూలు సవరణ రూల్స్) 2013, 2015 & 2018లో భారత రహదారుల మంత్రిత్వ శాఖచే ప్రచురింపబడిన రాజపత్రం నెం. G.S.R.778(E) తేది.16-12-2013, G.S.R.220(E) తేది.23-03-2015, G.S.R.920(E) తేది.25-09-2018 మరియు ఎన్.హెచ్.ఎ.ఐ. పాలసీ నెం.11041/218/2017-Admn తేది.31-12-2015 ప్రకారం ఒక వాహనానికి అనుమతింపబడిన సామర్థ్యము (స్థూల వాహన బరువు) కంటే అధిక బరువుతో జాతీయ రహదారిపై ప్రయాణించినచో వాహన రకమును బట్టి పది రెట్లు జరిమానా విధించబడును. మరియు అధికంగా ఉన్న బరువును (వాహనదారుని సొంత ఖర్చుతో) తొలగింపబడును.

5. సలహాలు, సూచనలు మరియు ఫిర్యాదులు చేయదలచినవారు. ఈ క్రింద తెలియజేసిన అధికారులను సంప్రదించగలరు.

	కన్సెషనర్	ఇండిపెండెంట్ ఇంజినీర్	ఎన్.హెచ్.ఎ.ఐ. కార్యాలయం
	పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్	టీమ్ లీడర్	ప్రాజెక్ట్ డైరెక్టర్– PIU మహబూబ్‌నగర్
చిరునామా	M/s వెస్టర్న్ ఆంధ్రా టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్, కి.మీ. 114.850 శాఖాపూర్ గ్రామము, అడ్డాకల్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా - 509382	M/s ఆర్వి అసోసియేట్స్ ఆర్కిటెక్ట్స్ ఇంజినీర్స్ & కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, Door No : 23-99/3, ప్లాట్ నెం. 401& 402 రోడ్ నెం.5, మధురనగర్, శంషాబాద్ - 501218	H.No. 10-4-32/c/2, ఎనుగొండ బైపాస్ రోడ్, వినాయకనగర్ కాలనీ, మహబూబ్‌నగర్- 509002
☎ సం.	9392898964	040–29553157	08542–293573

జాతీయ రహదారులపై సహాయం కొరకు 1033కి కాల్ చేయండి

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా? అయితే వారికి అందించండి అభినందనల చందనాలు. ఆకాంక్షించండి వారి భావిజీవిత సుఖమయ ఆనందాలు. తెలియజేయండి ఈనాడు ద్వారా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు.

సంప్రదించండి :
మహబూబ్‌నగర్ : 8008709794, 8008882661, 8008550249
వనపర్తి : 8008709798 నాగర్‌కర్నూల్ : 8008705545
జోగులాంబ గద్వాల : 8008882662, నారాయణపేట: 7680076453

(c) eenadu

బస్‌షెల్టర్ లేక బాధ

మండలంలోని తెలంగాణ కూడలిలో బస్టాప్ ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కూడలి దగ్గర బాలికల గురుకుల పాఠశాల ఉండటంతో పలు గ్రామాల నుంచి విద్యార్థులను కలవడానికి తల్లిదండ్రులు వస్తుంటారు. ఆర్డినరీ బస్సులు కూడా ఆపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, దాతలు, అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తెలకపల్లి**

కంపచెట్ల మాటున.. కనిపించని ప్రమాదం

పట్టణంలోని జాతీయ రహదారి-44 కొత్తకోట బైపాస్ సమీపంలోని వాగుపై వంతెన ప్రమాదకరంగా మారింది. కొద్ది నెలల క్రితం వంతెన రక్షణ గోడను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు వంతెన కింద కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కూలిన రక్షణ గోడలు కనిపించడం లేదు. చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాగులో పడిపోయే అవకాశం ఉంది. కూలిన రక్షణ గోడ దిమ్మెలు మిషన్ భగీరథ పైపులైన్‌పై పడటంతో పైపులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

శ్రీశైలానికి 9,722 క్యూసెక్కుల ప్రవాహం

బ్రహ్మగిరి(అమ్రాబాద్), న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి ఎగువన ఉన్న జూరాల నుంచి వరద కొనసాగుతోంది. శనివారం 9,722 క్యూసెక్కుల ప్రవాహం జలాశయాన్ని చేరింది. దీంతో సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 872.50 అడుగులు, నీటి నిల్వ 152.1568 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 3,050, ఎంజీకేఎల్ఐకి 2,400, పోతిరెడ్డిపాడుకు 8,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

"ఈ శ్రావణ మాసంలో.. మీ ఈనాడు పెళ్లిపందిరితో.. సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!"

- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) అవివాహితులకు సువర్ణావకాశం
- నేడు కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు సంబంధిత కుటుంబీకులు నేడు (30 ఆగస్టు 2026 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. **మరిన్ని వివరాలకు 9154340820 & 9154992572 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.** ● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు **Note:** ఈ శ్రావణ మాసంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో ● ఒక నెల ప్రొఫైల్ హైలైటర్ (మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం) ● అపరిమిత ఎక్స్ ప్రెస్ ఇంట్రెస్టులు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

చారకొండలో హీరో శర్వానంద్ హల్‌చల్

చారకొండ, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శనివారం సినీ నటుడు శర్వానంద్ రాకతో సందడిగా మారింది. మండల పరిధిలోని జేపల్లి గ్రామ శివారులో సర్వే నంబరు 148లో 25 ఎకరాల వ్యవసాయ భూమిని ఇటీవల ఆయన కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ మూడావత్ ఉమ ఆధ్వర్యంలో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది.

పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ ఉమ

అన్న మరణవార్త విని తమ్ముడి మృతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఒకే తల్లికి పుట్టి, కలిసి పెరిగిన అన్నదమ్ములు మరణంలోనూ కలిసే అనంతలోకాలకు పయనమయ్యారు. ఈ విషాద ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని పెరుమాండ్లపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సల్కూటి సింహారెడ్డి(68) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన తమ్ముడు సల్కూటి లింగారెడ్డి(64) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం తన అన్న చనిపోయాడని తమ్ముడికి సమాచారం అందించారు. దీంతో ఆయన పది నిమిషాల్లోనే మృతి చెందారు. సాయంత్రం గ్రామంలో అన్నదమ్ముల భౌతికకాయాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఒకే రోజు అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

లారీ కిందపడి మహిళ దుర్మరణం

రాఖీ పండుగకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం

నందిగామ, న్యూస్‌టుడే: రాఖీ పండుగకు కుమార్తె ఇంటికి వెళ్లిన తల్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటన షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలం ధన్‌సింగ్‌తండా బైపాస్ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఎస్సై దేవ్‌రాజ్ వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన దంపతులు మహేశ్వర్జీ, అరుణబాయి(42) రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం కర్మన్‌ఘాట్‌లో ఉన్న తమ పెద్ద కుమార్తె వద్దకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై తిమ్మాజిపేట వైపు వస్తున్నారు. ధన్‌సింగ్ తండా శివారు బైపాస్ రహదారిపై వెనక నుంచి వస్తున్న లారీ టైరు పేలడంతో అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణబాయి కిందపడ్డారు. లారీ టైరు ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో తలకు బలమైన గాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. భర్త మహేశ్వర్జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అదే మార్గంలో ప్రయాణిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి ప్రమాదం జరిగిన తీరును చూసి చలించిపోయారు. వాహనం దిగి బాధితులకు తక్షణ సహాయం అందించాలని పోలీసులకు సూచించారు.

అరుణబాయి

బరిలో దిగితే.. పతకాలే

కల్వకుర్తి, న్యూస్‌టుడే: బోటింగ్ చేయడమంటే సాహసమే. సెయిలింగ్ చేస్తూ ప్రత్యర్థులతో పోటీ పడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రాణిస్తోంది మీనిగ అక్షర. ఖోఖోలో చాకచక్యంతో ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ పతకాలు సాధించేందుకు నిత్యం సాధన చేస్తోంది మంగలి శ్రీలక్ష్మి. వారు కల్వకుర్తి పట్టణ ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో చదువుతున్నారు. ఉపాధ్యాయిని సింధు వారికి తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

సరదాగా ఆడిన ఆటలో గుర్తింపు

సరదాగా ఆడిన ఆట నేడు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం నక్కలవారిపల్లికి చెందిన **మంగలి శ్రీలక్ష్మి** పదో తరగతి చదువుతున్నారు. ఎనిమిది సార్లు జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. 2024లో తమిళనాడులో నిర్వహించిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. కర్ణాటకలో నిర్వహించిన సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 2024లో ఝార్ఖండ్, 2025లో ఒడిశాలో జాతీయ పోటీలు, కర్ణాటకలో నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో మూడో స్థానంలో నిలిచారు. 2025లో తమిళనాడు, కర్ణాటకలో జాతీయ జూనియర్ పోటీల్లో కాంస్యం సాధించారు. 2026లోవరంగల్‌లో జరిగిన నేషనల్ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల్లో శ్రీలక్ష్మి ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఏడాదికి గానూ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందజేసింది. ఉన్నతస్థానం చేరుకోవడమే లక్ష్యమని శ్రీలక్ష్మి తెలిపారు.

సెయిలింగ్‌లో దూసుకెళ్తూ

సెయిలింగ్‌లో దూసుకెళ్తూ : జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీల్లో ప్రతిభ చూపుతోంది వనపర్తి జిల్లా కేతపల్లికి చెందిన **మీనిగ అక్షర** తొమ్మిదో తరగతి చదువుతోంది. 2025లో మాన్‌సూన్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2025 సికింద్రాబాద్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రజతం సాధించారు. 2024 ఇండిపెండెంట్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. మల్టీక్లాస్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ భోపాల్‌లో జరిగిన జాతీయ క్రీడలో పాల్గొంది. 2026లో నార్త్ ఈస్ట్ రేగట్ట మేఘాలయలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపారు. వైఏఐ యూత్ నేషనల్ మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. 2026లో మాన్‌సూన్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. 2026లో క్యాడెట్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. 2026లో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు.

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30 గంటలకు తెరుస్తారు. స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7 గంటలకు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: దేశ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. శనివారం స్థానిక భాజపా కార్యాలయంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో అత్యధికంగా మత ఘర్షణలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయని పేర్కొన్నారు. ప్రధానిగా వాజ్‌పేయీ హయాం నుంచి నేటి నరేంద్రమోదీ వరకు దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. కేంద్రంలో భాజపా హయాంలోనే మైనార్టీలకు నిజమైన రక్షణ, విద్య, ఉద్యోగ, సంక్షేమరంగాల్లో సమాన అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ వాస్తవాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని మైనార్టీ మోర్చా నేతలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస హయాంలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అధికారంలో ఎవరుంటే వారికి వత్తాసు పలుకుతూ మజ్లిస్ పార్టీ చీకటి ఒప్పందం చేసుకుంటూ పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. క్రిస్టియన్, మైనార్టీల్లో మతతత్వ పార్టీ అని భాజపాపై విద్వేషం పెంచుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, భారాస నాటకాలను నమ్మకుండా దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని మైనార్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగ్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశంలో మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని వివరించారు. సమావేశంలో భాజపా, మైనార్టీ మోర్చా రాష్ట్ర, జిల్లా నేతలు పద్మజారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, జయశ్రీ, ఎ.అంజయ్య, అఫ్సర్‌పాషా, మహబూబ్‌అలీ, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రామచందర్‌రావు, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగ్‌మోహన్‌సింగ్ తదితరులు

క్రీడలపై విద్యార్థులకు పెరుగుతున్న ఆసక్తి

పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు రావడమే కాకుండా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అందుకోసం నేటి తరం విద్యార్థులు ఆటలపై దృష్టి సారిస్తున్నారని పీయూ వీసీ డా. జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పీయూలో మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే జీవితంలో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. ఖేలో ఇండియా ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇప్పటికే తమ వర్సిటీ నుంచి ఎం.ప్రవల్లిక 200 మీటర్ల పరుగులో జాతీయ స్థాయిలో స్వర్ణం, ఎన్.విష్ణువర్ధన్ ఆర్చరీలో రెండు జాతీయ స్థాయి స్వర్ణ పతకాలు, ఎన్‌కే గీత జాతీయ స్థాయిలో రజతం సాధించారని గుర్తు చేశారు. అనంతరం ఆయా క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులను వీసీ ఘనంగా సన్మానించారు. పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి, వీడీ శ్రీనివాసులు, నూర్జహాన్, కరుణాకర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, సంధ్యారాణి, రవికుమార్, రాజశేఖర్, గౌస్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

క్రీడాకారుడిని సన్మానిస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు తదితరులు

లభించని శ్వేత ఆచూకీ

వీపనగండ్ల, న్యూస్‌టుడే: నేపాల్ వరదల్లో చిక్కుకొన్న వీపనగండ్లకు చెందిన శ్వేత పుట్ట గురించి శనివారం వరకు ఎలాంటి సమాచారం లభించక పోవడంతో కుటుంబంలో, గ్రామంలో ఆందోళన నెలకొంది. భర్త సురేశ్‌రెడ్డి, కుమారుడు అనీశ్‌రెడ్డితో కలిసి అమెరికాలో స్థిరపడిన ఆమె ఈనెల 12న ఈశా ఫౌండేషన్, ఈశా గ్రూప్ ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. పర్యటన ముగించుకొని ఈనెల 25న ఆమె హైదరాబాద్‌కు వచ్చి, రెండు రోజుల పాటు ఉండి 29న అమెరికాకు బయలుదేరాల్సి ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. పర్యటన ముగించుకొని ఈనెల 25న ఉదయం కాఠ్‌మాండూకు చేరుకునేందుకు టిబెట్ వద్ద ఉండే కార్యాలయంలో అనుమతి కోసం వెళ్లగా.. అప్పుడే భారీ వరదలు సంభవించినట్లు తెలుస్తోంది. ఆమె క్షేమ సమాచారంపై ఎలాంటి స్పష్టత రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మనోవేదనకు గురవుతున్నారు.

నేటి నీట్ పీజీకి సర్వం సిద్ధం

- రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు
- హాజరుకానున్న 360 మంది అభ్యర్థులు

పాలమూరు, న్యూస్‌టుడే: నీట్ పీజీ - 2026 అర్హత పరీక్షకు మహబూబ్‌నగర్ జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 360 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో 180 మంది, ధర్మాపూర్ సమీపంలోని జయ ప్రకాశ్‌నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాలలో 180 మంది అభ్యర్థులకు పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్ష విధానం అంతా అంతర్జాలంలో రాయాల్సి ఉంటుంది. అభ్యర్థులను ఉదయం 7 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 8.30 గంటలకు గేట్లు మూసేస్తారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. చరవాణులు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ భద్రతను కల్పిస్తున్నారు.

ఫాతిమా విద్యాలయంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఇద్దరు అధికారులకు బాధ్యతలు : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని నీట్ -పీజీ పరీక్ష కోసం రెండు కేంద్రాలకు ఇద్దరు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఫాతిమా విద్యాలయం వద్ద మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్, జేపీఎన్‌సీఈ వద్ద ఆర్డీవో నవీన్ పర్యవేక్షించనున్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధం చేశారు.

ఆలస్యమైతే.. ద్విచక్ర వాహనాలతో సిద్ధంగా : అనివార్య కారణాల వల్ల ఆలస్యంగా వచ్చే అభ్యర్థులను సకాలంలో పరీక్ష కేంద్రాలకు తరలించడానికి తొలిసారిగా గ్రామ పంచాయతీ అధికారుల (జీపీవోలు)ను నియమించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదుగురు, రైల్వేస్టేషన్‌లో మరో ఐదుగురు జీపీవోలు అందుబాటులో ఉంటారు. హెల్ప్ యూ-నీట్ 2026 పరీక్ష అని బోర్డులతో వీరు ద్విచక్ర వాహనాలతో సిద్ధంగా ఉంటారు. ఇలా సిబ్బందిని నియమించడం ఇదే మొదటిసారి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ వినూత్నంగా ఆలోచించి అభ్యర్థులకు మెరుగైన సేవలు అందించేలా ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఎవరైనా అనారోగ్యానికి గురైతే పరీక్ష కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఔషధాలతో సేవలు అందించనున్నారు.

శాఖల సమన్వయంతో..

'న్యూస్‌టుడే' వివరణ కోరగా అన్ని పరీక్షలు సజావుగా నిర్వహించడానికి శాఖలు సమన్వయం చేసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశాం. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

- మధుసూదన్ నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

క్రీడా దినోత్సవం.. విద్యార్థుల సంబరం

రాజోలి, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని రాజోలి కేజీబీవీ, మాన్‌దొడ్డి ఉన్నత పాఠశాలల్లో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. కేజీబీవీలో బాలికలు హాకీ ఇండియా ఆకారంలో కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. మాన్‌దొడ్డిలో జీహెచ్ఎం హరుణ్‌రషీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను సర్పంచి సుజాత ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

హాకీ ఇండియా ఆకారంలో బాలికలు

రక్షాబంధన్ వేడుకలకు హాజరు

వెల్దండ, న్యూస్‌టుడే: న్యూదిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో వెల్దండ మండలం గుండాల ఏకలవ్య గురుకుల విద్యార్థిని ఎ.వైష్ణవి పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19 మంది విద్యార్థులు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు రాఖీ కట్టే కార్యక్రమానికి అవకాశం లభించగా... తొమ్మిదో తరగతి చదువుతున్న వైష్ణవికి ఆహ్వానం అందింది. రాష్ట్రపతితో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో వైష్ణవి పాల్గొనడంపై ప్రిన్సిపల్ సుమన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్, ఉపాధ్యాయులు సుధీర్‌నాయక్, రీనా, అనీషా, గీతు, చంద్రన్ హర్షం వ్యక్తం చేసి విద్యార్థినిని అభినందించారు.

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Gujarat based FMCG Chocolate Pvt. Ltd. Co. Need Districts wise Super Stockist, Area wise Distributors & Sales Officers. Ph: 7993608649

ఫ్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9704209449

HOUSE FOR SALE

House for sale 161 yards, West facing, 2BHK DTCP layout,30 feet road, quality construction, 200 mtrs to Bypass ✆9121668012

New G+1 House For Sale, Northeast Facing, 150 Sq.Yds, Backside Of Pista House, MBNR. ✆ 99669 75125, 86393 31798

2BHK, పోర్టికో తూర్పు ముఖంగా ఉన్న ఇల్లు అమ్మకానికి ఉంది. గోల్డెన్ అపార్ట్‌మెంట్స్ బ్యాక్ సైడ్, టీచర్స్ కాలనీ, MBNR ✆ 9704583320/8466891675

EENADU Classifieds

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

2Acers Commercial Land for Sale @ Srisailam H/W Facing Nr Dindi Project Tollplaza Usefull for Hotel, Daba, Farm House. 95022 66888, 9440147855.

భూమి అమ్మకానికి కలదు. తెలంగాణ రాష్ట్రం, నాగర్‌కర్నూల్ జిల్లా, దేశిఇటిక్యాల గ్రామంలో కొల్లాపూర్ చౌరస్తాకు దగ్గరలో NH-167K కు 500 మీటర్ల దూరంలో 3 ఎకరాల మెట్ట భూమి అమ్మకానికి కలదు. ఆసక్తి గలవారు సంప్రదించగలరు. ఫోన్: 9966738603

MANGO FARM for sale
12.5 Acres,
RTC Bus Route Road,
Near SIDDIPET- MUSTABAD
"T" JUNCTION,
WITH 3 BORE WELLS.
TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

Mahabubnagar, Yenugonda, Opp: SVS Medical College Hostel, Sriram Nagar Colony, 400 Sq.Yds. 2 Sides Road. ✆ 9985599945.

మహబూబ్‌నగర్ టౌన్ అప్పన్నపల్లిలో పోచమ్మ టెంపుల్ వెనుక 236 గజాల North/East face గల ప్లాటు అమ్మబడును సెల్: 9866308535

LEASE

G+3 neat Bldg.Location: Behind Mallikarjuna Enterprises New Town (Skill India Bldg.) with Cellar, 10,000 Sft. for Lease for Offices, Bank, Financial Instt., College Etc., interested Pl. Contact to Mob: 9100389060

LEASE/ RENT

Commercial Space for rent at Erra Satyam Chowrasta Circle, G+2 Floors, Pent House. Contact: 9705655944

TO LET

న్యూటౌన్ X రోడ్ దగ్గర యం.నగర్ లో 325 Sqft గల shop అద్దెకు ఇవ్వబడును. Contact: 8790373595 / 9963345543

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

మహబూబ్‌నగర్ హాస్పిటల్ ఫార్మసీ లో పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు కావలెను. Contact Number: 9689689115

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీ॥ 25K-30K, భోజనము+వసతి కల్పించబడును. వెంటనే ✆ 9866252220

మ.నగర్ జిల్లా ప్రముఖ ఏజెన్సీ నందు పనిచేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను, మంచి జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 93987 24094

వంటమనిషి కావలెను వసతి భోజన సౌకర్యం కలదు, జీతం: 10,000 to 12,000 వరకు, సిద్ధార్థ మోడల్ స్కూల్ తెల్కపల్లి, నాగర్‌కర్నూల్ ✆ 9705076876

Hyd,ఆటోనగర్ మెడికల్ ఏజెన్సీలో చేయుటకు Exp.గల కంప్యూటర్ ఆపరేటర్లు 2& ప్యాకింగ్ హెల్పర్స్, 4వీలర్ డ్రైవర్లు, హౌస్‌కీపింగ్ వర్కర్లు కావలెను.9490044041

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసిన వారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

Hydలోని ప్రముఖ టిఫిన్ సెంటర్ లో స్టాల్‌బాయ్స్, సూపర్ వైజర్స్ (ఫ్రెష్/Exp) కావలెను. జీ: 18K, 12గం|| ఫ్రీ వసతి + భోజనం. 9666934949/9963165905.

సేల్స్ బాయ్స్ & సేల్స్ గర్ల్స్ యం.నగర్ లో బొంబే గార్మెంట్స్‌లో పని చేయుటకు అనుభవం గల వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం సెల్: 7981453208

WANTED

హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.
ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక ఇంచార్జ్ కావాలి.
నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు.
అర్హత - ఇంటర్మీడియట్,
ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26, టైమింగ్స్ : ఉ. 10 నుండి 6 సా.
ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకొని రాగలరు.
సంప్రదించండి : కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

FACULTY/ TEACHERS

Wanted Lady Teachers: To teach primary class subjects. In English Medium school, Bhoothpur, MBNR. Cell No: 9441292465

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact :
Mahabubnagar
8008709794

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10 గం. నుంచి మ.1 వరకు

మహబూబ్‌నగర్: 8008333816 భూత్పూర్: 8686783574 బాలానగర్: 9705983863 దేవరకద్ర: 9000031648 జడ్చర్ల: 8008573899, 8008573901

? కోయిలకొండ మండలంలోని వెన్నచేడు తండాకు వెళ్లే దారి గుంతలు పడింది. మరమ్మతులు చేపట్టండి. - రాము

✔ పరిశీలించి మరమ్మతులు చేస్తాం. - మిథున్, పీఆర్ ఏఈ (కోయిలకొండ, న్యూస్‌టుడే)

? దేవరకద్ర పురపాలికలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - రాఘవేంద్ర

✔ సమస్య పరిష్కరిస్తాం. - నరేష్‌బాబు, పుర కమిషనర్ (దేవరకద్ర, న్యూస్‌టుడే)

తెరపై ఈనాడు

శ్రీనివాస - టాకీస్, బాలాజీ - టాకీస్. తిరుమల - ఇరుముడి. వెంకటేశ్వర - విశ్వనాథ్ అండ్ సన్స్, మైత్రి శ్రీకృష్ణ స్క్రీన్-1 - ఇరుముడి. స్క్రీన్-2 - ఇరుముడి. దేవరకద్రలో: రాఘవేంద్ర - టాకీస్ - న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ టౌన్, దేవరకద్ర

నేత్రపర్వంగా పూజలు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్ల పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో స్వామి వారి ఆరాధన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం సుప్రభాతం, పాదపూజ, అష్టోత్తర పారాయణం, కనకాభిషేకం, పంచామృతాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు బాలకృష్ణచార్యులు, రామచంద్రాచార్యులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో అంతర్గత డ్రైనేజీ

కోయిలకొండ, న్యూస్‌టుడే: పారుపల్లి గ్రామంలో పంచాయతీ నిధులతో అంతర్గత డ్రైనేజీను నిర్మిస్తున్నట్లు సర్పంచి రాజరఘుపతిరెడ్డి తెలిపారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోని వ్యర్థ జలాలు రోడ్డుపైకి రావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి డ్రైనేజీ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

సర్ తాఖీదులపై విచారణ

భూత్పూర్, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా తహసీల్దార్ కిషన్ శనివారం భూత్పూర్ మండలంలోని కొత్తూర్‌లో విచారణ చేపట్టారు. ఓటరు జాబితాలో వివరాలు సరిగా లేని, 2002 జాబితాతో సరిపోని 11,201 మందికి ఎన్నికల సంఘం తరఫున తాఖీదులు జారీ చేశారు. తాఖీదులు అందుకున్న ఓటర్లను ప్రత్యేకంగా కలుస్తూ విచారణ చేపడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కురుమూర్తి, మండల కార్యదర్శి జగన్ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం జడ్చర్లలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. సత్తయ్య, జంగయ్య, సాయిలు, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలు లేక.. దాహార్తి తీరక

బాలానగర్ మండలంలోని నేరళ్లపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి కుళాయిలు నిరుపయోగంగా మారాయి. గత వేసవిలో గుర్తు తెలియని వ్యక్తులు నల్లాలను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి వాటికి మరమ్మతులు చేయలేదు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బాలానగర్**

నేడు ఎంపీ డీకే అరుణ రాక

ధన్వాడ, న్యూస్‌టుడే: ఎంపీ డీకే అరుణ ఆదివారం మండల కేంద్రమైన ధన్వాడకు వస్తున్నట్లు భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సుంకు ఉమేష్‌కుమార్ తెలిపారు. ప్రతి ఆదివారం ప్రధాని నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ఉదయం తొమ్మిది గంటలకు ధన్వాడ నుంచే ఎంపీ పాల్గొంటారని, ఆ తర్వాత కుర్వవాడలో నిర్మించిన కామరాతి బీరప్ప ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరవుతారని వెల్లడించారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

పాగా వేసిన జాగా.. ఖాళీ చేయాల్సిందే..!

భూత్పూర్ కూడలిలో ఆక్రమణలపై తాఖీదులు

భూత్పూర్, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-44కు చెందిన ఖాళీ స్థలాల్లో పాగా వేసిన వారిని తొలగించేందుకు ఎల్‌అండ్‌టీ చర్యలు తీసుకుంటోంది. రహదారి పొడవునా భూత్పూర్, జడ్చర్ల కూడళ్లు, ఐల్యాండ్ స్థలాలు ఎక్కడికక్కడ ఆక్రమణకు గురయ్యాయి. అనుమతులు లేకుండా చాలామంది వ్యాపారులు శాశ్వత ప్రాతిపదిక డబ్బాలు ఏర్పాటు చేసుకొని ఎలాంటి రుసుములు చెల్లించకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై కూరగాయలు, తినుబండారాలు, పువ్వులు విక్రయించి జీవనోపాధి పొందేవారు. క్రమంగా కొందరు వ్యక్తులు రాజకీయ పలుకుబడితో సొంతంగా డబ్బాలు ఏర్పాటు చేసి తదుపరి అద్దెకు ఇస్తూ కాసులు కూడబెడుతున్నారు.

● హైదరాబాద్- బెంగళూరు నగరాలను కలుపుతూ జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ ప్రైవేటు భాగస్వామ్యంతో ఎన్‌హెచ్-44ను నిర్మిస్తోంది. ఇందులో భాగస్వాములైన ప్రైవేటు ఏజెన్సీలకు ఒప్పందం ప్రకారం నిర్వహణ బాధ్యతలతోపాటు రహదారి పన్నుల వసూలు చేసుకునే అవకాశం కల్పించారు. ఎల్‌అండ్‌టీ సంస్థ జడ్చర్ల పై వంతెన మొదలు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ఆమడబాకుల స్టేజి వరకు 57 కిలోమీటర్ల మేర నిర్వహణ అప్పగించారు. 2009లో ప్రారంభమైన ఒప్పందం సెప్టెంబర్ 12తో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ సేకరించిన స్థలాలు, ఐల్యాండ్‌లు 2009లో ఉన్న మాదిరిగానే అప్పగించేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ సిద్ధమైంది. అందులో భాగంగానే భూత్పూర్ కూడలి, జడ్చర్ల కూడలి, దాబాల వద్ద హైవే స్థలాలపై అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన డబ్బాలు, వ్యాపారాలను తొలగించే పనిని ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌హెచ్ఏఐకి చెందిన స్థలాల్లో వ్యాపారాలు సాగిస్తున్న అందరికీ తాఖీదులను జారీ చేస్తున్నారు. శాశ్వత షెడ్లు, డబ్బాలను వారం రోజులు, తాత్కాలిక షెడ్లకు మూడురోజుల గడువు విధిస్తూ భూత్పూర్‌లో 52 మందికి, జడ్చర్లలో 30కి పైగా నోటీసులు అందజేస్తున్నారు.

భూత్పూర్‌లో తాఖీదు అందజేస్తున్న ఎల్‌అండ్‌టీ సిబ్బంది

ఉపాధి కోల్పోతాం: భూత్పూర్ చౌరస్తాలో చాలా కాలంగా పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నా. ఉన్నట్టుండి పండ్ల వ్యాపారం తొలగించమంటే ఎక్కడికి వెళ్లాలి. భూత్పూర్‌లో చిరువ్యాపారులు, కూరగాయలు, పండ్ల విక్రయాలకు ప్రత్యేక స్థలం చూపిస్తే అక్కడే వ్యాపారం చేసుకుంటాం. పాలకులు, అధికారులు చొరవ తీసుకోవాలి. **- ఎల్లమ్మ, పండ్ల విక్రేత**

మజ్లిస్ ఎమ్మెల్సీ ఆగడాలపై కాంగ్రెస్, భారాసల మౌనమెందుకు?

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ధ్వజం

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: ఓ బాలికపై లైంగిక దాడి కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మజ్లిస్ ఎమ్మెల్సీ ఆగడాలపై కాంగ్రెస్, భారాసలు ఎందుకు నోరు విప్పడం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థిని ఓడించేందుకు ఆ పార్టీలు మజ్లిస్‌తో కుమ్మక్కయ్యాయని ఆయన ధ్వజమెత్తారు. శనివారం మహబూబ్‌నగర్‌కు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, భారాస అంతర్గత ఒప్పందంతో ముందుకెళ్తున్నాయని ఆరోపించారు. మజ్లిస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. [illegible] కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడుతోందని ఎద్దేవా చేశారు. ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు కోసమే ఉపయోగించుకుంటోందని కాంగ్రెస్ పార్టీ విధానాలపై ధ్వజమెత్తారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే సూత్రాన్ని పాటిస్తూ దేశంలోని అన్ని వర్గాల సమాన అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని వివరించారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రతి పథకం మైనార్టీలకూ ఉపయోగపడుతుందని చెప్పారు. ఉపకార వేతనాలు, ఆర్థిక సాయం మైనార్టీ విద్యార్థులకు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ డీకే అరుణ, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్, భాజపా జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, [illegible] పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు

జడ్చర్ల, న్యూస్‌టుడే: పురపాలికలో చేపడుతున్న అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జడ్చర్ల పురపాలికకు చెందిన అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల పనితీరు, అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. కమిషనర్ గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినారాయణ విగ్రహ ప్రతిష్ఠ

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్లలోని నాగసాల సమీపంలోని స్వామినారాయణ గురుకుల పాఠశాలలో శనివారం భగవాన్ స్వామి నారాయణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మేయర్ మమత, దేవ్‌ప్రసాద్ దాస్‌జీ స్వామీజీ, శుకవల్లబ్‌దాస్‌జీ స్వామీజీ, కృష్ణచరణ్‌దాస్‌జీ స్వామీజీలతో పాటు 21 రాష్ట్రాల స్వామీజీలు హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్వామీజీతో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని నవాబ్‌పేట, కారుకొండ గ్రామ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు టై, బూట్లు, బెల్టులు, దయాపంతులపల్లి, హజిలాపూర్, కొండాపూర్, రుద్రారం, కాకర్లపహాడ్, తీగల్‌పల్లి, సిద్దోటం, కారుకొండ, హన్మసానిపల్లి, కూచూరు, కారూర్, ఇప్పటూరు, చెన్నారెడ్డిపల్లి, ఎన్మనగండ్ల గ్రామాల్లో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కాకర్లపహాడ్ గ్రామంలో పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. మార్కెట్ ఛైర్మన్ హరలింగం, తహసీల్దార్ సురేశ్, సర్పంచులు గీతారాణి, కమలమ్మ, లక్ష్మమ్మ, రాఘవేందర్, రవి, బాలయ్య, లక్ష్మమ్మ, మల్లేశ్‌గౌడ్, సంతోషి, భీమయ్య, సుమతి, శంకర్, రవికిరణ్, నవనీత, రంజిత్‌కుమార్‌గౌడ్, ఎంఈవో నాగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: విద్యార్థులతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఉద్యోగ విరమణ తప్పనిసరి

బాలానగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని డీసీఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బాలానగర్‌లో ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ నర్సింహులు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో నర్సింహులును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రాజేందర్‌సింగ్, శ్రీధర్‌గౌడ్, టీపీసీ సమన్వయకర్త దత్తాత్రేయ, తదితరులు పాల్గొన్నారు.

ప్రవచిస్తున్న వేదపండితుడు

రాఘవేంద్రస్వామి సేవలో ఎంపీ డీకే అరుణ

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

పరిమళగిరి శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి బృందావనం

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లోని పరిమళగిరి శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు శనివారం కనులపండువగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు విశేష పూజలు చేస్తారు. మొదటి రోజు పూర్వారాధన పూజల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, పాదపూజ, కనక మహాపూజ, పంచామృతాభిషేకం, అలంకరణ సేవ వైభవంగా జరిపారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

రథోత్సవంలో ఎంపీ: శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో ఎంపీ డీకే అరుణ పూజలు చేసి.. రథోత్సవంలో పాల్గొన్నారు. నగర మేయర్ జి.మమత తదితరులు పూజలు చేశారు.

శ్రీరామకాలనీలో విగ్రహ ప్రతిష్ఠాపన

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం ఏనుగొండ పరిధిలోని శ్రీరామకాలనీలో పలు దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈ పూజల్లో ముఖ్యఅతిథిగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి.పద్మజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పెద్దగొల్ల నర్సిములు తదితరులు పాల్గొన్నారు. అర్చకుల మంత్రోచ్చారణతో దేవతా విగ్రహాలకు క్షీరాధివాసం, ధాన్యాధివాసం, రుద్రహోమం చేశారు. సాయంత్రం విగ్రహాల ఊరేగింపు వైభవంగా జరిపారు. ఆదివారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ బాధ్యులు వెల్లడించారు.

పూజల్లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు.. జలాధివాస పూజల్లో భక్తులు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

బాలానగర్, న్యూస్‌టుడే: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని బాలానగర్, నేరళ్లపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంఈవో శంకర్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు దివాకర్, సత్యాశిలారెడ్డి, అయ్యపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దేవరకద్ర, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సహజమని పుర ఛైర్‌పర్సన్ దమయంతి పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దేవరకద్ర బాలుర పాఠశాల ఆవరణలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతుల ప్రదానం చేశారు. ఎంఈవో బలరాం తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అందిస్తున్న పుర ఛైర్‌పర్సన్ దమయంతి, తదితరులు

మిడ్జిల్, న్యూస్‌టుడే: మిడ్జిల్ మండల వ్యాప్తంగా శనివారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

ప్రజాసేవలో అలసత్వం తగదు

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారంలో, ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం వహించొద్దని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై మహబూబ్‌నగర్ రూరల్ మండల కార్యాలయంలో ఆయన శనివారం సమీక్షించారు. 45 రోజులకోసారి ప్రగతి పురోగతిపై సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణంలో అలసత్వం తగదని స్పష్టం చేశారు. మండలంలో లోఓల్టేజీ సమస్య అధిగమించేందుకు 132 కేవీ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నర్సింహారెడ్డి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ బి.అనిత, పీఏసీఎస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో కరుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లాలోని మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుంకుడు శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్, ఎంసెట్, క్లాట్, ఎన్ఎంఎంఎస్, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు సెప్టెంబరు 15 తేదీలోగా 98668 56577, 83486 33589 ఫోన్ నంబర్లలో వాట్సప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బుక్కస్వామి, గోనెల వెంకటేశ్వర్లు, ఆర్.రమేశ్, నర్సిరెడ్డి, సదానంద్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచండి

గండీడ్, మహమ్మదాబాద్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. గండీడ్, మహమ్మదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులను శనివారం ఆయన తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించారు. వ్యాక్సిన్, మందుల నిల్వలు, రోగ నిర్ధారణ సేవలు, సిబ్బంది హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు రాజు, పులి విద్య, సుభాష్‌చంద్ర, జరీనా బేగం, వైద్య సిబ్బంది దుర్గమల్లేశ్వరి, బాలమణి, శ్వేత పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం జడ్చర్ల కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ హెర్బల్ క్లినిక్‌ను తనిఖీ చేశారు.

బాకీ కార్డులతో ప్రజల్లోకి భారాస

భూత్పూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలపై బాకీ కార్డుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రేణులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సెప్టెంబర్ 2-8 తేదీ వరకు నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. మహిమూద్, బస్వరాజుగౌడ్, వామన్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కుమ్ములాటలు.. కొట్లాటలతోనే కాంగ్రెస్ పాలన

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని, నాటి నుంచి ప్రజాపాలన విస్మరించి కుమ్ములాటలు, కొట్లాటలతోనే సాగుతోందని భారాస మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక భారాస కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల అంతర్గత సమస్యలతో రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందన్నారు. భారాస హయాంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబాటుతనానికి గురైందన్నారు. కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని వెల్లడించారు. ప్రాజెక్టు పనుల్లో ఎక్కడా అవినీతి జరగలేదని ఎన్‌డీఎస్‌ఏ నివేదికను అధికారికంగా ఇస్తే, అక్రమాలు జరిగాయని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. తెలంగాణకు వచ్చే సాగునీటిని అడిగే దమ్ము తెలంగాణ సీఎం, మంత్రులకు లేదన్నారు. మన నీటిని ఆంధ్రా పాలకులు తరలించుకుపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా సాగునీటి కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భారాస నాయకులు రాజేశ్వర్‌గౌడ్, అబ్దుల్ రెహమాన్, వెంకన్న, నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో భారాస నాయకులు

ఎస్ఈ ఛాంబర్‌లో బాహాబాహీ

సంఘాల నాయకుల తోపులాట

ఎస్ఈ ఛాంబర్‌లో గొడవపడుతున్న 1104 యూనియన్, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో సీనియర్ అసిస్టెంట్ నుంచి జేఏవోగా పదోన్నతుల్లో నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇచ్చారని ఆరోపిస్తూ కార్మిక సంఘాల నేతలు స్థానిక మెట్టుగడ్డలోని ఎస్ఈ కార్యాలయంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ యూనియన్, 1104 సంఘం నాయకుల మధ్య మాటల యుద్ధం పెరిగి బాహాబాహీ వరకు వెళ్లింది. ఈ గందరగోళం మొత్తం సంబంధిత ఎస్ఈ ఛాంబర్‌లో అధికారి కళ్లముందే సాగింది. ఇరు సంఘాల నాయకులు పరస్పర వ్యతిరేక నినాదాలు చేసుకుంటూ తోపులాటకు దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఒక వర్గానికి కొమ్ముకాసేలా పోస్టింగ్‌లో ఇవ్వడమేమిటని 1104 సంఘం నేతలు ఎస్ఈని నిలదీశారు. ఎస్ఈని ఛాంబర్ నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు.

ఒక వర్గానికే వత్తాసు : పదోన్నతుల్లో ఒక వర్గానికి వత్తాసు పలికేలా ఎస్ఈ వ్యవహరించారని 1104 సంఘం బాధ్యులు జి.స్వామి, పాండు ఆరోపించారు. దీన్ని అడిగేందుకు వెళ్లగా ఇరు సంఘాల మధ్య రెచ్చగొట్టేలా మాట్లాడారని అన్నారు. ఎస్ఈ వ్యవహారంపై విద్యుత్తు సంస్థ సీఎండీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఆదివారం కూడా తమ నిరసన, ధర్నా కొనసాగుతుందని 1104 సంఘం నేతలు జి.స్వామి, పాండు వెల్లడించారు.

సీసీ దారి.. పగుళ్లు బారి

మిడ్జిల్ మండలం మిడ్జిల్-వెలుగొముల గ్రామాల మధ్య దుందుభి వాగులో చెక్‌డ్యాం కింద ఉన్న సీసీ రహదారి అధ్వానంగా మారింది. పగుళ్లు వచ్చి గోతులతో ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జడ్చర్ల న్యూటౌన్**

విద్యార్థినికి అస్వస్థత

మిడ్జిల్, న్యూస్‌టుడే: మిడ్జిల్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థిని శనివారం అస్వస్థతకు గురైంది. అంబులెన్స్ సిబ్బంది గణేష్, శివ ప్రథమ చికిత్స చేసి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజుల నుంచి విద్యార్థిని అనారోగ్య సమస్యతో బాధపడుతోందని పరీక్షలు ఉండటంతో ఇటీవల విద్యాలయానికి వచ్చిందని ప్రత్యేకాధికారిణి కవిత తెలిపారు.

మహిళకు గాయాలు

గండీడ్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు గాయాలైన ఘటన గండీడ్ మండలంలోని జానంపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నాచేడ్ గ్రామానికి చెందిన నాగమణి జానంపల్లి సర్వీస్ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డారు. ఆమెను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీపీఐ నేత నారాయణ పరామర్శ

మాజీ ఎంపీ మధును పరామర్శిస్తున్న సీపీఐ నేత నారాయణ

పాలమూరు, న్యూస్‌టుడే: ఏపీ సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధును సీపీఐ జాతీయ నేత కె.నారాయణ పరామర్శించారు. ఈ మేరకు శనివారం మహబూబ్‌నగర్‌లోని మాజీ ఎంపీ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మధు భార్య సుమతీ ఇటీవల మరణించిన నేపథ్యంలో పరామర్శించారు. నారాయణ మాట్లాడుతూ సుమతి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జోగినీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ఆమె పాత్ర అమోఘమన్నారు. వారి ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులుగా కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, మాజీ కార్యదర్శి పరమేశ్ గౌడ్, నాయకులు రాము, సత్యనారాయణరెడ్డి, రహమాన్, బస్వరాజ్, వెంకటయ్య, సీపీఎం నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో మంజులాదేవి అన్నారు. శనివారం జడ్చర్లలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంలు అనంతప్ప, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రకళ, విజయ్‌కుమార్, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

తేది : 29.08.2026

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ తరఫున జారీచేయు బహిరంగ ప్రకటన ఏమనగా, మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలము, ఆలూర్ గ్రామ శివారులో గల భూమి సర్వే నెం. 36/A/ఆ/2 విస్తీర్ణం ఎక. 0-36 గుంటలు మరియు సర్వే నెం. 37/ఆ/2, విస్తీర్ణం ఎక. 1-00 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎక. 1-36 గుంటలు భూమి యజమాని అయిన అద్దుల సత్తిరెడ్డి తండ్రి కీ.శే. అద్దుల వెంకటరెడ్డి, నివాసం: ప్లాటు నెంబర్ 102, నలంద నగర్, వెంకటేశ్వర గుడి, ఎర్రబోండ, అత్తాపూర్, హైదరాబాద్ గారి దగ్గర నా క్లయింట్ కొనుటకు నిర్ణయించుకొని, భూయజమానికి బయానా చెల్లించి, భూమి విక్రయ అగ్రిమెంట్ పొందియుండిరి. కావున పై కనబరిచిన భూమి విషయములో ఎవరికైనను ఎటువంటి అధికారములు, హక్కులు, ఆక్షేపణలు ఉన్న యెడల వాటికి సంబంధించిన పత్రాల యుక్తముగా ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి (7) రోజులలోపు తమ ఆక్షేపణలు ఈ క్రింద కనబరిచిన చిరునామాకు తెలియజేయవలెను. నిర్ణయించిన కాలవ్యవధి తరువాత వచ్చే ఆక్షేపణలు పరిగణలోకి తీసుకోబడవు. అందుకు వారే బాధ్యత వహించవలసియుండును. ఆక్షేపణలు కాలవ్యవధి లో రానియెడల ఇట్టి భూమిపై ఎటువంటి ఆక్షేపణలు లేనట్టుగా భావించి కాలవ్యవధి అయిన వెంటనే నా క్లయింట్ పై చూయించిన భూమిని తన పేర రిజిస్ట్రేషన్ చేసుకోగలడు.

పై కనబరిచిన భూమి యొక్క హద్దులు:

తూర్పు : R&B రోడ్,
పడమర : గడ్డం యాదయ్య గారి భూమి,
ఉత్తరము : గడ్డం ఆంజనేయులు గారి భూమి,
దక్షిణము : గడ్డం నాగయ్య గారి భూమి.

సం/-

శంకర్ నారాయణ ఝువార్, MBA, LL.B., న్యాయవాది, చంద్రా గార్డెన్ కమాన్ దగ్గర, బాదేపల్లి, జడ్చర్ల - 509301, మహబూబ్‌నగర్ జిల్లా. ఫోన్ నెం: 98495 73451